
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 28 ఆగస్టు 2024

కేసీఆర్‌ను ఎదుర్కోలేకే కవితపై అక్రమ కేసులు 8లో..

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి 7లో..



ఆటలకు ఆటంకాలెన్నో..?

కత్తిమీద సాములా పోటీల నిర్వహణ...

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు దాదాపు దాతల సహకారంతోనే ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు క్యాలెండర్ విడుదల అయ్యింది. కానీ వీటి నిర్వహణకు అవసరమైన, సరిపడా నిధులు కేటాయించకపోవడంతో పోటీల నిర్వహణ కత్తిమీద సాములా మారింది. దీనికి తోడు ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల బడ్జెట్ చాలా మొత్తంలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రతీసారి దాతల సహకారంతో నిర్వహణ చేయాలంటే పీఈటీలు సైతం కొంత ఇబ్బందిపడుతూ విముఖత చూపే పరిస్థితులు నెల కొన్నాయి. అయితే తాజాగా ప్రభుత్వం క్రీడా పాలసీని రాష్ట్రంలో తీసుకువస్తామంటూ చేసిన ప్రకటన క్రీడాకారుల్లో నూతన ఉత్సాహం నింపుతుంది.

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక దృడత్వాన్ని పెంపొందిస్తాయి. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే చదువుతో పాటు ఆటలు అవసరం. ఆత్మవిశ్వాసం, మానసిక చురుకుద నానికి దోహదపడే క్రీడలకు ఆటంకాలు అనేకం వెంటాడుతున్నాయి. జగిత్యాల జిల్లాలో చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోగా, ఆటలకు పీరియడ్స్ సైతం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. కేవలం పీఈటీలు ఉన్న పాఠశాలల్లో మాత్రం అడపాదడపా వారానికి మూడు రోజుల పాటు ఆటలు నిర్వహిస్తున్నారు. ఇటీవల శాసనమండలి సమావేశాల్లో జరిగిన చర్చలో భాగంగా విద్యార్థులకు రోజు గంట పాటు ఆటలకు సమయం కేటాయించాలని ఎమ్మెల్సీలు కోరగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొనడంతో క్రీడాకారుల్లో నూతనోత్తేజం వెల్లివిరిసింది. పాఠశాలల్లో పీఈటీ పోస్టులు భర్తీ, క్రీడలకు మైదానాలు లేకపోవడంతో ఈ ఆటంకాలు ఎదురవుతున్నాయి.

క్రీడలకు విద్యార్థులు దూరం

పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలో, స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు మినహా మిగిలిన సమయాల్లో తక్కువే. డ్రిల్ పీరియడ్ మర్చిపోయి చదువులపై దృష్టిపెట్టడంతో విద్యార్థులకు ఆటలంటే ఏంటో తెలియకుండా పోయే పరిస్థితి వచ్చింది. అడపాదడపా క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వ హించడం తప్ప మరో ఆట తెలియకుండా పోతుంది. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా, పీఈటీలు లేకపోవడం మెజార్టీ ప్రైవేట్ పాఠశాలల్లో మైదానాలు లేకుండా పోవడం ఆటలకు ఇబ్బంది కరంగా మారింది. ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించకపోవడంతో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి లేకుండా పోయింది.

- పాఠశాలల్లో కనిపించని మైదానాలు
- ఆటలకు ప్రత్యేకంగా కేటాయించని సమయం
- వెక్కిరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు
- దాతల సహకారంతో ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణ..?

నిర్వహణ ఇలా..

జిల్లాలో మొత్తం 185 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా, అందులో పీఈటీలు సుమారు 85 మంజూరు పోస్టులు ఉండగా, 74 మంది వరకు ప్రస్తుతం పీఈటీలున్నారు. దీన్ని బట్టి సుమారు వంద ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలు లేరని స్పష్టంగా అర్థం అవుతోంది. ఉన్న పీఈటీల్లో నుంచి ఇటీవలే పీడీలుగాపదోన్నతి పొందారు. 85 నుంచి ఈ డీఎస్సీలో 11 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో దుస్థితి ఇలా ఉంటే ప్రైవేట్ పాఠశాలల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. 95శాతం ప్రైవేట్ పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహణ, ట్యూషన్‌లు, హోంవర్క్‌కే విద్యార్థులు పరిమితం అవుతున్నారు. దీంతో ఆటలకు సమయం లేకుండా పోతుంది.

పాఠశాలలో మాక్ ఎలక్షన్

ధర్మపురి, ఆగస్టు 27: ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌లో మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా ఎలక్షన్ కమిషన్ గురించి, నామినేషన్ వేయడం, విత్ డ్రా చేసుకోవడం, ప్రచారం చేయడం, ఓటు హక్కును వినియోగించుకోవడం గురించి వివరించారు. బ్యాలెట్ బాక్స్ గురించి, ఈవీఎం మిషన్, వీవీ ప్యాట్ మిషన్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రధానోపాధ్యాయులు తోట శంకర్, డైరెక్టర్లు గట్ల శ్రీనివాస్, సంగనభట్ల సంతోషి, సోషల్ టీచరు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

అతిథి మహిళా అధ్యాపకురాలి కోసం దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాలరూరల్, ఆగస్టు 27 : జగిత్యాలరూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మైక్రో బయోలాజీ బోధనకు మహిళ అతిథి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వేముల వనిత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో మాస్టర్ డిగ్రీ అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హులైనవారిని డెమోద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు నేరుగా కళాశాలకు వచ్చి డెమోకు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్. 8374000563 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

రాయికల్, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాంకేతిక విద్య సౌకర్యాన్ని అందించి ప్రోత్సహించడం అభినందనీయమని మాజీ సర్పంచులు బెక్కం తిరుపతి, మండల జల రమేష్ అన్నారు. మండలంలోని మూటపెల్లి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి గుండ స్వాతి సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువు సా ధించిన సందర్భంగా రూ.10 వేల విలువ గల కంప్యూ టర్‌ను పాఠశాలకు అందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు సాంకేతిక విద్య సౌకర్యాన్ని అందించిన పూర్వ విద్యార్థిని ఉపాధ్యా యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పాఠశాల పూర్వ విద్యార్థి గుండ స్వామి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీడీని అభినందించిన ఎంఈవో

కొడిమ్యాల, ఆగస్టు 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫీజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బూట్ల రాజమల్లయ్య హైదరాబాదు మారథాన్ -2024హాఫ్ మారథాన్ విభాగంలో ఫినిషర్స్ మెడల్ సాధించినందుకు పీడీని మంగళవారం కొడిమ్యాల ఇన్‌చార్జి ఎంఈవో అయిత శ్రీనివాస్ అభినందించారు. ఎన్ఎండీసీ హైదరాబాదు రన్నర్స్ ఆధ్వర్యంలో ఈనెల 25 ఆదివారం హైదరాబాదు పీపుల్స్ ప్లాజా నుంచి గచ్చిబౌలీ వరకు నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో 21.095 కిలో మీటర్ల దూరం పరుగెత్తి ఫినిషర్స్ మెడల్ సాధించడంతో ఎంఈవో హర్షం వ్యక్తం చేశారు. పీడీని పలువురు స్పూర్తిగా తీసుకొని పరుగు పందెంలో పాల్గొని విజయం సాదించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు 27 : మండల కేంద్రానికి చెందిన మారు భూదమ్మ అనే వృద్ధురాలు ఇటీవల మృతి చెందటంతో మృతురాలి కుటుంబ సభ్యులను మంగళ వారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, భువనసుందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, కిషన్‌రెడ్డి ఉన్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి : డీఏవో

కొడిమ్యాల, ఆగస్టు 27 : రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి. వాణి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం మండలంలోని పూడూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల సాగులో తమకు ఎదురవుతున్న సమస్యలను శాస్త్ర వేత్తలో నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల రుణమాఫీ కాని రైతుల వివరాలను ఒక కొత్త ఆప్ ద్వారా సేకరిస్తున్నామన్నారు. రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అధైర్య పడవద్దన్నారు. వరి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పూడూర్ సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఏవో జ్యోతి, ఏఈవోలు గ్రీష్మ, ప్రశాంత్, మంజుల, లావణ్య, మాజీ సర్పంచు రాంరెడ్డి ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో వాణి

పట్టణ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

●బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ●సాదాసీదాగా జగిత్యాల బల్దియా సాధారణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం సమ స్యల పరిష్కారమే లక్ష్యంగా తమ పాలకవర్గం ముందుకు వెళ్తుందని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన ఆగస్టు-2024 మాసానికి సంబంధించిన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 41 అంశాలతో రూపొందించిన ఎజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు అమోదం తెలిపారని ఆమె తెలిపారు. కౌన్సిల్ సభ్యులు తమ సమస్యలను కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించగా ఆ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాల పట్టణంలో మునుపెన్నడూ లేని విధంగా పట్టణ అభివృద్యే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పట్టణంలో రాబోయే వినాయక చవితి, నిమజ్జన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలు క్వారీ డస్ట్, మొరంతో పూడ్చాలని, నిమజ్జనానికి సంబంధించి తాత్కాలిక విద్యుద్దీకరణ, చింతకుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, గజ ఈతగాళ్లు, నాటు తెప్పలు, ఏర్పాటుకు రూ.28.70 నిధులు కేటాయించామని, అలాగే రాబోయే బతుకమ్మ దసరా పండగ సందర్భంగా ఏర్పాట్లకు రూ. 24లక్షలు, మిలాద్ ఉన్ నబి పండగ సందర్భంగా పట్టణంలోని మెయిన్ జంక్షన్‌లు, ముస్లిం గ్రేవియార్డ్ వద్ద లైటింగ్ ఏర్పాటుకు రూ.50 వేలు, డిసెంబర్‌లో జరిగే క్రిస్టమస్ పండగకు సంబంధించిన వివిధ చర్చిల వద్ద ఏర్పాట్ల నిమిత్తం రూ.5లక్షలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేయుటకు ఓపెన్ వెల్ సబ్ మెర్సిబుల్ మోటార్స్ కొనుగోలుకు రూ. 9.20లక్షలు, 62వ వార్షికోత్సవాల సందర్భంగా పట్టణంలోని లోకమాత పోచమ్మ ఆలయం వద్ద వసతులకు రూ.20.75 లక్షలు, నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, అలాగే ఇందిరమ్మ ఇళ్లలో నివసించేందుకు వస్తున్న లబ్దిదారులకు పారిశుధ్యం, నీటి సదుపాయం సరఫరా నిమిత్తం రూ.49 లక్షలు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులుతో పాటు మున్సిపల్ కార్యాలయంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఐదు మాసాల తర్వాత నిర్వహించిన సాధారణ సమావేశంలో ప్రజాసంక్షేమం విస్మరించి, ప్రజాఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదని 35వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ఆరోపించారు. మరో కౌన్సిల్ సభ్యురాలు వొద్దినేని శ్రీలత మాట్లాడుతూ డీజిల్ బిల్లులో భారీ కుంభకోణం జరిగినట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఆరు నెలల నుంచి అడుగుతున్న డీజిల్ లాక్‌బుక్ వివరాలు వెల్లడించకపోవడం తమ అనుమానానికి మరింత బలం చేకూర్చేలా ఉందన్నారు.

కార్యకర్తలకు భవిష్యత్‌లో మంచి స్థానం కల్పిస్తాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 27: కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో మంచి స్థానం కల్పిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ధర్మ పురి మండలం నుంచి అప్పం తిరుపతి, బుగ్గారం నుంచి రెంటం శ్రీధర్, వెలగటూర్ నుంచి పూదరి రమేష్, పెగడపల్లి నుంచి పురుషోత్తం, ధర్మారం నుంచి సోగాల తిరుపతి, గొల్లపల్లి నుంచి పురంశెట్టి గౌతం, నియోజక వర్గ అధ్యక్షులుగా యశోద అజయ్‌ను ప్రకటించారు. అనంతరం సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకుల కష్టంలో తన వెంట ఉండి ఎమ్మెల్యేగా గెలిపించడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజక వర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ముస్కు నిశాంత్‌రెడ్డి, బుర్ర రాములుగౌడ్, రాజేష్, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ రుసుము విరమించుకోవాలి



ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మల్యాల, ఆగస్టు 27: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వద్ద వాహనాల పార్కింగ్ రుసుము వసూలు యోచన విరమించుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఈవో రామకృష్ణరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొండపైన అనేక సమస్యలు ఉన్నాయని, అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకోకుండా భక్తులపై భారం మోపడం సరికాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్కింగ్ రుసుము వసూలు చేస్తే ఆందోళనలు తప్పవన్నారు. ఈవోకు వినతిపత్రం అందించిన వారిలో వీహెచ్‌పీ నాయ కులు యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, గాజుల మల్లేశం, బొడిగె సురేష్, బు దారపు శంకర్, గౌతంరాజ్ ఉన్నారు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



చెక్కుల పంపిణీ అనంతరం లబ్దిదారులతో ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, ఆగస్టు 27 : సీఎం సహాయ నిధి పేదలకు వరం అని చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమణి, ఎంపీవో వాసవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కొడిమ్యాల, పూడూర్ సింగిల్ విండోల చైర్మన్లు రాజనర్సింగరావు, రవీందర్‌రెడ్డి, పూడూర్ సింగిల్ విండో డైరెక్టర్లు మల్లేశం, నాయకులు ఉన్నారు.

ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని ఆపెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు భక్తులు 56 రకాల పిండి పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు భోజన ప్రసాదం వితరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణతో అలంకరణతో వచ్చిన వారు ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరింపిచేశాయి. అనంతరం సోమవారం అర్ధరాత్రి వరకు భక్తులు హరినామ సంకీర్తనలతో భజన కార్యక్రమంలో భక్తి పారవశ్యంతో ఆనందంగా గడిపారు. నాయకులు, ఇస్కాన్ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దాపూర్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో గిడ్డంగులు నిర్మించారని దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాల క్రితం సుమారు 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు నిర్మించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా చేపట్టే పీడీఎస్ బియ్యంతో పాటు, ఫర్టిలైజర్స్, నూనె ఉత్పత్తులు, విత్తనాలు, నిల్వ చేపడుతుండడంతో సుమారు పది మందికి పైగా గోదాముల్లో నిల్వ చేసే ఉత్పత్తులను స్థానిక కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతు న్నారన్నారు. గత ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల నిర్వహణకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంలను కేటాయించడంతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు ప్రైవేట్ గోదాములపై ఆధారపడవల్సి వస్తుందన్నారు. గిడ్డంగుల నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

11 కేవీ విద్యుత్ లైన్ పనులు అడ్డుకున్న గ్రామస్థులు

శంకరపట్నం, ఆగస్టు 27: మండలంలోని కన్నాపూర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేయవద్దని విద్యుత్ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. అర్కండ్ల శివారులో రైస్‌మిల్ నిర్మిస్తున్నారు. కన్నాపూర్ సబ్‌స్టేషన్ నుంచి రైస్‌మిల్‌కు విద్యుత్ అందించేందుకు పనులు ప్రారంభించారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామస్థులు పనులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాడికల్ ఏఈ సంపత్‌రెడ్డి అక్కడకు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వేరే ప్రాంతం నుంచి వేసుకోవాలని వారు ఏఈకి సూచించారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయని, విద్యుత్ స్తంభాల కోసం గుంత తీస్తే అవి పగిలిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ఏఈ సంపత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.


ఏఈతో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఆలయంలో చోరీ

వీర్నపల్లి, ఆగస్టు 27 : వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలోని జగదాంబ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలగొట్టి డబ్బులను ఎత్తు కెళ్లారు. స్టేషన్ హౌస్ ఇన్ చార్జి బాబు కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఆలయం వద్ద హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని హుండీతో పాటు పరిసరాల ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్‌లో మద్యం..

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్‌లో సోమవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. వైన్స్ తాళం పగుల గొట్టిన దొంగలు లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, మరో రూ. 10 వేల మద్యం ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వైన్స్ తెరిచేందుకు నిర్వాహకులు వచ్చి చూడగానే తాళం పగులగొట్టి కౌంటర్ తెరిచి ఉండడంతో ఆందోళన చెందారు. ఈ సంఘటనపై వైన్స్ యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేముల సాయికృష్ణను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 26న మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ సాయికృష్ణ పట్టుబడ్డాడని చెప్పారు. వేములవాడ పట్టణంలోని కొందరు వ్యక్తుల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణాలతో పాటు పరిసర గ్రామాలకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

కత్తెరతో దాడి కేసులో ముగ్గురికి జరిమానా

జ్యోతినగర్, ఆగస్టు 27: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపల్లి గ్రామంలో చింతపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కత్తెరతో దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి శ్రీనివాసులు తీర్పునిచ్చారు. 30 అక్టోబరు 2019లో ఖాజీపల్లి గ్రామంలో చింతల లింగయ్య, చింతల కోమురయ్య, చింతల సాయితేజ అనే ముగ్గురు ఒక భూ వివాదంలో శ్రీనివాస్‌పై కత్తెరతో దాడి చేశారు. అప్పటి ఎన్టీపీసీ ఎస్‌ఐ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ సాక్షులను కోర్టులో అడిషనల్ ప్రాసిక్యూటర్ ఆకుల రాములు సమక్షంలో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు విన్న తరువాత ముగ్గురు నిందితులను దోషులుగా జడ్జి నిర్ధారిస్తూ చింతల లింగయ్యకు ఆరు వేలు, చింతల కోమురయ్య పది వేలు, సాయితేజకు ఆరు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

వైపని కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో జక్కని సతీష్(29) అనే వైపని కార్మికుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన జక్కని సతీష్ వైపని కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఒక సోదరి ఉంది. మంగళవారం ఉదయం బయటకు వెళ్లి టిఫిన్ చేసి ఇంటికి వచ్చిన సతీష్ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. నిద్రపోయాడని భావించిన పక్క గదిలో ఉంటున్న అతని సోదరి బీడీలు ఇచ్చేందుకు కంపెనీకి వెళ్లి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలైనా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సోదరి తమ్ముడిని ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నిస్తే ఎంతకు రాకపోవడంతో పైకప్పు పెంకులు ఊడదీసి చూసే సరికి సతీష్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తొలగించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వస్త్రపరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక పోవడం, ఒంటరి జీవితాన్ని భరించలేక మద్యానికి అలవాటుపడి మనస్థాపం చెంది తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోదరి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 27: మండలంలోని మల్యాల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రశాంత్ అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుమార్



గాయపడ్డ అనూష్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పెగడపల్లి, ఆగస్టు 27 : పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో మంగళవారం వీధి కుక్కల దాడిలో పదకొండు చిన్నారి తీవ్రగాయాల పాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మడిగెల నరేష్, శిరీష దంపతుల కుమారుడు బాబు అనూష్ (11నెలలు) ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. దీంతో బాబు నుదుటి మీద తీవ్ర గాయమైంది. అప్రమత్తమైన బాబు తల్లిదండ్రులు బాబును రక్షించి వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,014	4,459	80.5	58.709
ఎల్లంపల్లి	9,886	9,852	20.175	17.785
మిడ్ మానేరు	10,500	14,600	27.54	18.19
ఎల్ఎండీ	14,824	224	24.034	8.37

వివాహిత కిడ్నాప్ కేసులో
ఆరుగురి అరెస్టు

- ఇద్దరు పరార్
- అరెస్ట్ అయినవారిలో మాజీ నక్సలైట్ దంపతులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన జక్కుల ధరణి అనే వివాహిత కిడ్నాప్‌నకు పాల్పడిన కేసులో ఆరుగురు కిడ్నాపర్‌లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివాహిత కిడ్నాప్ వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన ధరణిని బోయిన్‌పల్లి మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కమటం కృష్ణవంశీ ప్రేమించుకొని 2022లో పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి ఇష్టం లేనందున ఎలాగైనా తమ కూతురి మనసు మార్చి మరో పెళ్లి చేయాలని భావించిన కుటుంబ సభ్యులు ప్రస్తుతం కామారెడ్డిలో ఉంటున్న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ నక్సలైట్ గొట్టె మనోహర్, అతని భార్య పద్మలను కలిసి చెప్పారు.

ఇందుకు మాజీ నక్సలైట్ మనోహర్ దంపతులు రూ.5 లక్షలు ఇస్తే పరిష్కరిస్తామని ఒప్పందంచేసుకొని ధరణిని కిడ్నాప్ చేయడానికి ఒక ఏడాది నుంచి ప్రణాళిక వేసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రాము, వేములవాడకు చెందిన ఎక్కల దేవి బాలకిషన్, టిల్లు జగదీష్‌ల సహాయంతో పథకం వేసుకొని ఓ కారు అద్దెకు తీసుకొని ఈ నెల 22న బూరుగుపల్లిలోని అత్తగారింటి నుంచి వివాహిత ధరణిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ సమయంలో ఆమె అడపడుచు ఆపేందుకు ప్రయత్నం చేసినప్పటికీ వారి కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి ధరణిని కిడ్నాప్‌చేసి కామారెడ్డి నుంచి నిజామాబాద్ జిల్లా లోని చుండూరు గ్రామం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వైపు తీసుకెళ్లి ఆమె మనసు మార్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ కిడ్నాప్ సంఘటనపై వెంటనే ఆమె భర్త బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కిడ్నాపర్‌లు ధరణిని తిరిగి బూరుగుపల్లిలో విడిచిపెట్టారు. ఈ మేరకు రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన జక్కు లక్ష్మి, జక్కు రాజశేఖర్, చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రమేశ్, కోనరావుపేటకు చెందిన గొట్టె మనోహర్, గొట్టె పద్మ, కోనరావుపేట మండలంలోని మలక్‌పేటకు చెందిన ఎక్కల దేవి బాలకృష్ణలను వేములవాడ, బాలనగర్ ప్రాంతాల్లో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మిగతా టిల్లు, జగదీష్‌లు పరారీలో ఉన్నారని వీరిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. కోనరావు పేట మండల కేంద్రానికి చెందిన గొట్టె మనోహర్ అనే మాజీ నక్సలైట్ అతని భార్య పద్మలు కామారెడ్డిలో ఉంటూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని చెబుతూ అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని వీరిపై సిరిసిల్ల, కామారెడ్డి, జగిత్యాల జిల్లాలోని పలు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. వీరికి సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, మాజీ నక్సలైట్ పేరుతో ఎవరైనా బెదిరిం పులకు పాల్పడితే వారి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జానపద కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 27: ఉమ్మడి జిల్లాలోని 60 సంవత్సరాలు నిండిన జానపద, సంచార జాతుల కళారూపాల కళాకారులు పేర్ల నమోదు, పింఛన్ల కోసం పేర్ల నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ జన, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్, కార్యదర్శి ప్రకాశ్, ఉప కార్యదర్శి కనకం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

డప్పులు, కోలాటం (మహిళలు, పురుషులు) కళాకారులు వారి సంస్థ, వ్యక్తిగత పేరు, సంస్థ కళాకారుని సంఖ్య పంపాలని పేర్కొన్నారు. దుబ్బ, చిందు యక్షగానం, చిరుతల రామాయణం, జడకోలాటం, వీరనాట్యం, కడ్డీ వాయిద్యం, చిరుతల, చెక్క భజనలు, కాటిపాపలు, బ్యాండ్, సన్నాయి మేళా లు, తాటిపాములవారు, సాధనాశూరులు, బుడగ జంగాలు, పాండవుల కథ, వీరప్రభలు, గొల్ల సుద్దులు, గుస్సాడి, కొమ్ము కోయ, ఒగ్గుకథ, బైండ్ల పోతు రాజులు, బోనాలు, బోనాల కోలాటం, పులివేషాలు, చెంచులు, రాజన్న డోలు, తోలు డప్పులు, నగారా, బుడుబుక్కలవారు, గంగిరెద్దులు, మొండి బండ, దాసరి, వంశరాజులు, పిచ్చగుంట్లవారు, కిన్నెర, జోగి, బాల సంతులు, బహురూపులు, మంద హెచ్చు, తెరచీరలు, అద్దం పటం, కొర్ర రాజులు, రుంజ, బుర్రవీణ, శారద గాండ్లు, గడజట్టి తదిర కళారూపాలకు చెందిన కళాకారులు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తులను సెప్టెంబరు 10వ తేదీలోగా జి కృపాదానం, 7/49/2/2/2, రేకుర్తి, కొత్తపల్లి మండలం, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని సూచించారు. మిగతా వివరాలకు 810600 6238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆవులను తరలిస్తున్న లారీ పట్టివేత

ఊపిరి ఆడక ఆరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరెగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు.

ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్యశాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్, సోహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.





ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్య శాఖ సిబ్బంది, లారీలో ఊపిరి ఆడక మృతి చెందిన ఆవులు

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్



గోదావరిఖని, ఆగస్టు 27: బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్‌ను దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్యా ఈ నియామకం చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్‌ను వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ 75 లక్షల మంది దళిత సామాజిక వర్గాన్ని సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించడంతో పాటు దళితులకు బీజేపీ దగ్గర కావాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోదీ దళిత సామాజిక వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీ దేశంలో, సిద్ధాంతం, నిబద్ధతతో పని చేస్తోందని, దళిత యువతీ యువకులను పార్టీలో చేర్పించాలని హైకమాండ్ ఆదేశించినట్లు చెప్పారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఆగస్టు 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద వాహన రుసుము వసూలు

కొండపైకి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనాలు పోలీస్ చెక్‌పోస్టు నుంచి కొండ పైకి వెళ్లడానికి దేవస్థానం అధికారులు రూ.50 వసూలు చేశారు. దీనిపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్లు ఇస్తూ వాహనాల రుసుము వసూలు చేయడం ఇదే మొదటి సారి అని ఇలా చేయడం ఏంటనీ ప్రశ్నించారు. దేవస్థానానికి ఆదాయం పెంచుకోవడానికి అనేక మార్గాలు ఉండగా వాటిపై దృష్టి సారించని అధికారులు వాహనాలు వెళ్లడానికి రుసుము వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసికి
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

గంభీరావుపేట ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులను అందించే కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌లను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. దమ్మన్నపేట పాఠశాలలో పని చేస్తున్న సంపత్‌కుమార్ సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి కలిగించడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్ల అవార్డులను స్వీకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంపత్‌కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ గ్రామీణ విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారు. 2022 సంవత్సరంలో దమ్మన్నపేట జడ్పీ పాఠశాలకు సైన్స్ ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. పెద్దపల్లి జిల్లా చందనాపూర్‌తో పాటు దమ్మన్నపేటలో పనిచేస్తున్న క్రమంలోనూ ఇన్నోవేటర్ల అవార్డులను అందుకున్నారు. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు ఇన్నోవేటర్ల తయారీలో ప్రతిభను కనబర్చారు.



జాతీయ సదస్సులో తాడూరి సంపత్‌కుమార్ ఇన్నోవేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి (ఫైల్)

ఇందులో 16 మంది జాతీయ స్థాయిలో, 8 మంది అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. పోలెండ్, జపాన్, దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నలుగురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. 2018 నుంచి 2023 వరకు వరుసగా జాతీయ స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడంతో పాటు తన మార్గనిర్దేశనంలో విద్యార్థులు పలు అవార్డులను అందుకున్నారు. పది మంది విద్యార్థులు ఇంటింటా ఇన్నోవేటర్ల పోటీలో ఐదు అవార్డులను అందుకున్నారు. సంపత్ కుమార్ ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాల్లో 6, 7, 8 తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల విభాగంలోనూ ఉన్నారు. టీ శాట్ ద్వారా ఉపాధ్యాయులు, టీచర్లకు డిజిటల్ బోధన అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా తాను పదవీ విరమణ పొందే వరకు వంద ఇన్నోవేటర్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంపత్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే 53 ఇన్నోవేటర్లను అందించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ, ఇన్‌స్పైర్ అవార్డులను విద్యార్థులు అందుకునే విధంగా చేయడం ఆనందంగా ఉందన్నారు. బంజారా భాషలోకి సైన్స్ పాఠాలను అనువదించి మాతృభాషలో వారికి పాఠాలను కూడా బోధించినట్లు తెలిపారు.

హోల్‌సేల్, రిటైల్
వ్యాపారుల మధ్య వివాదం

పెద్దపల్లి మార్కెట్‌లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసి రిటైలర్ల నిరసన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27 : పెద్దపల్లి మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో హోల్‌సేట్ వ్యాపారుల తీరును నిరసిస్తూ మంగళవారం రిటైల్ వ్యాపారులు ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారు. దీంతో కూరగాయల కోసం ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు 30 మంది, రిటెయిల్ వ్యాపారులు 100 మందికి పైగా ఉన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారుల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉదయం 8 గంటల వరకే విక్రయించాల్సి ఉండగా, పొద్దంతా హోల్‌సేల్ ధరలకే కూరగాయలను విక్రయిస్తుండడంతో రిటైల్ వ్యాపారులు నష్టపోతున్నారు. దీనిని నిరసిస్తూ సోమవారం రిటైల్ వ్యాపారులు కూరగాయల మార్కెట్‌ను బంద్ చేశారు.



పెద్దపల్లి మార్కెట్‌లో కూరగాయల కోసం ఎగబడుతున్న జనం

మంగళవారం కూడా మార్కెట్‌ను బంద్ చేసి సుమారు 30 వేల రూపాయల విలు వైన కూరగాయలను కుప్పలుగా పోసి ఉచితంగా పంపిణీ చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టగా రెండు గంటల్లో కూరగాయలన్నీ అయిపోయాయి. వివాదం విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 9:30 గంటల వరకు విక్రయాలు జరుపుకోవాలని, రిటైల్ అమ్మకాలు చేయవద్దని, 5 కిలోలకు తక్కువ గాకుండా మాత్రమే విక్రయించాలని ఒప్పందం కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది.

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని ఇంటికి అక్రమంగా విద్యుత్

- కనెక్షన్ తొలగించిన అధికారులు

వేములవాడ, ఆగస్టు 27: భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు, వేములవాడ మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. కొన్ని సంవత్సరాలుగా చెన్నమ నేని రమేష్ నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మున్సిపల్, సెస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చెన్నమనేని రమేష్‌బాబు నివాసమైన సంగీత నిలయం (జర్మనీ గెస్ట్‌హౌస్) లోని పలు బల్బులకు మున్సిపల్ స్ట్రీట్ లైట్స్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చి నట్లుగా గుర్తించి తొలగించారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పలు వురు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ లైన్ నుంచి అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించామని, అక్రమంగా విద్యుత్ వినియోగించిన బిల్లుకు సంబంధించిన సొమ్మును రికవరీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు పొందిన మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడైన చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లు తేలడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



చెన్నమనేని నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

కేసీఆర్‌ను ఎదుర్కోలేకే కవితపై అక్రమ కేసులు



జగిత్యాలలో సంబరాల్లో పాల్గొన్న వసంతసురేష్

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్

● జైలు నుంచి కవిత విడుదల కావడంతో సంబరాలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 27 : ఆలస్యమైనా.. న్యాయమే గెలిచిందని, కేసీఆర్‌ను ఎదుర్కొనలేకనే కేంద్రప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టిందని జగిత్యాల మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనందరావు, మల్లేశం, దేవేందర్‌నాయక్, శ్రీనివాస్, రాంమోహన్‌రావు, అమీన్‌బాయ్, గంగాధర్, శీలంప్రియాంకప్రవీణ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఏ ఆధారాలు చూపకుండా, అక్రమంగా రాజకీయ కక్ష్యతో కల్వకుంట్ల కవితను రాజకీయ ప్రేరేపిత కేసులో 166 రోజులు జైల్లో పెడితే ఆఖరికి న్యాయమే గెలిచిందని దీంతో న్యాయస్థానాలపై నమ్మకం పెరిగిందని జగిత్యాల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాదులకు, తమ నాయకురాలు తరఫున వాదించిన లాయర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

●ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టులో బెయిల్‌పై విడుదలైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ రమణ నివాసంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కోరుట్ల : ఎమ్మెల్సీ కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులో టపాసులను పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వనతపుడు అంజయ్య, బాస్కర్ రెడ్డి, నాయకులు రహీం పాషా, వినోద్, నరేష్, సలావోద్దిన్ పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, మండల, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్పందన, ఉదయశ్రీ, మండల సమన్వయ సభ్యులు లావుడ్య సురేందర్, బర్కం మల్లేష్, దొంతి నాగరాజు, నాగరాజు, గంగారాం, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, కాంతారావు, మహేష్ గౌడ్, కన్నాక మహేందర్, శ్రీరాముల సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి హర్షం వెలిబుచ్చారు. మంగళవారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు మాసాలు జైలులో బంధించినా ఎలాంటి ఆధారాలు చూపలేక పోయారన్నారు.



మెట్‌పల్లిలో బాణాసంచా కాలుస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కోరుట్లలో టపాసులు పేల్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): కవితకు ఢిల్లీ లిక్కర్ స్కాంలో సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు పటాకులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు నల్ల తిరుపతిరెడ్డి, కొరెపు రవి, ఎండి జావిద్, మారుతి, సత్యనారయణ గంగాధర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు పంచి సంబరాలను జరుపుకున్నారు. జగ్గసాగర్ గ్రామంలోని మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్ గ్రామంలో టపాసులు కాల్చి, స్వీట్లను పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు డాకూరి వెంకటేష్, గొల్లపల్లి రాజేందర్, కమ్మరిపేట వెంకన్న, భైర మహేష్, పిడుగు గంగారెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్ : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా మండలంలోని రేగుంట గ్రామంలో జాగృతి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం గ్రామంలోని ప్రజలకు స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కథలాపూర్, ఆగస్టు 27 : మండలంలోని బొమ్మెనకు చెందిన ముంజ శంకరయ్య, చెట్లపల్లి గంగమధుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రు. 31 వే విలువైన చెక్కులను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పంపిణీ చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సిఫార్సు మేరకు ఈ నిధులు మంజూరు కాగా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మహేంధర్, జనార్ధన్, వినోద్‌రావు ఉన్నారు.

భీమారం: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జంగిలి స్వామికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మేడిపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ఏనుగు రమేష్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి అజయ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

30 నుంచి 3 వరకు స్కూల్ గేమ్స్

కథలాపూర్, ఆగస్టు 27 : ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 3 దాకా మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆనందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30న అండర్ 14 మరియు 17 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, 31న అండర్ 14 మరియు 17 బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, సెప్టెంబర్ 2న బాల, బాలికల ఫైనల్స్, సెలక్షన్, 3న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థిని, విద్యార్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో రాజేశ్, సరిత, రవీంధర్, రాజు, రవి పీఈటీలకు అందించాలని పేర్కొన్నారు.

ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మోహన్

రాయికల్, ఆగస్టు 27: రాయికల్ మండలం ఇటిక్యాల ప్రభుత్వ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా భీమనాతి మోహన్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మోహన్ ఇంతకుముందు కొడిమ్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఐదు సంవత్సరాల నుంచి విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇటిక్యాల ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చెరువు, కుంటలను సర్వే చేయాలి

మల్లాపూర్, ఆగస్టు 27 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల శివారున గల చెరువులు, కుంటాలను సర్వే జరిపి అక్రమాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మత్స్య కార్మికులు తహసీల్దార్ వీర్‌సింగ్‌ను కోరారు. సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. గ్రామాల్లోని అక్రమదారులు చెరువులు, కుంటాలను కబ్జాకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటి వరకు కబ్జా చేసిన వారి నుంచి చెరువులు కాపాడాలని కోరారు.

29న ఎస్‌జీఎఫ్ క్రీడలు

గొల్లపల్లి, ఆగస్టు 27: గొల్లపల్లి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంఈవో జమునా దేవి తెలిపారు. అండర్-17, అండర్-17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లలో ఈ నెల 29న పోటీలు జరుగుతాయన్నారు. 30న మల్లన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17, అండర్-14 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబరు 2న క్రికెట్ పోటీలకు బాలురు, బాలికల జట్లకు ఎంపిక పోటీలు చిల్వాకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9396614777, 9440773267లలో సంప్రదించాలని అన్నారు.

రైతు మహాధర్నాలో పాల్గొనాలి

మల్లాపూర్, ఆగస్టు 27 : అఖిల పక్షం ఆధ్వర్యంలో ఈనెల 29న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే రైతు మహాధర్నాలో రైతులు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని రైతు సంఘాల నాయకులను కలిసి రైతు మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. షరతులు లేకుండా ఏకకాలంలో రుణ మా ఫీ, రైతుకు పెట్టుబడి సాయం, వరికి బోనస్ ప్రకటించాలని వంటి సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అఖిలపక్షం నాయకులు మామాడి నారాయణరెడ్డి, రాజారెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అంటు వ్యాధుల నివారణ

కోరుట్ల, ఆగస్టు 27 : ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోని అంటు వ్యాధుల నివారణకు ప్రజలు శ్రద్ధ చూపాలని వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి - ప్రభాకర్, వైద్యురాలు రమ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎశీకోని గుట్ట ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల అద్వేర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు జ్వర పీడితులను గుర్తించి మందుల పంపిణీ చేశారు.

రుణమాఫీ యాప్‌పై గందరగోళం

మల్యాల, ఆగస్టు 27: పంట రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం రైతుల వివరాలు నమోదు చేయడానికి తీసుకువచ్చిన ప్రత్యేక యాప్‌పై అధికారులు, రైతుల్లో గందరగోళం నెలకొంది. కుటుంబ వివరాలు అప్‌లోడ్ ప్రక్రియ అస్పష్టత ఏర్పడింది. దీంతో అధికారులు యాప్‌లో నమోదు తాత్కాలికంగా పక్కన పెట్టిన్నట్లు తెలుస్తుండగా రైతులు రుణమాఫీపై ఆందోళన చెందుతూనే ఉన్నారు. నిత్యం వ్యవసాయ కార్యాలయం వద్దకు రుణమాఫీ గురించి తెలుసుకోవడానికి వస్తున్నారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం స్పష్టత ఇస్తుందనే దీమాతో కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. అయితే పంటల సాగు గురించి మాత్రమే వివరించి మంగళవారం సాయంత్రం వరకు రుణమాఫీపై విధివిధానాలు వస్తాయని చెప్పి ముగించారు. దీంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారులను రుణమాఫీపై ఆరా తీశారు. అధికారులు కూడా రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు

మహిళా చట్టాలపై అవగాహన

జగిత్యాలరూరల్, ఆగస్టు 27 : ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మహిళల రక్షణ కోసం వారిచట్టాలపై జిల్లా కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా షీ టీం ఏఎస్సై వలీబేగ్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం వారిపై జరిగే నేరాలను అరికట్టడమే లక్ష్యంగా షీ టీం పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయసడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో షీ టీం ఏఎస్సై వాలీబేగ్, మహిళకానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న భారత్ సురక్షా సమితి నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని భారత్ సురక్షాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిత బెయిల్ విషయంలో బండి సంజయ్‌ని అవమానించేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తక్షణమే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, పోచమల్లు, శంకర్, లక్ష్మరెడ్డి, వెంకటరెడ్డి, భూమన్న, దేవయ్య, అంజన్న, బాలయ్య, సంపత్‌రావు, రాజు తదితరులున్నారు.

డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్,ఆగస్టు 27 : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఐపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలో డెంగ్యూ వ్యాధి పట్ల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరు నిల్వఉండడం ద్వారా లార్వా రూపాంతరంచెంది అందులో నుంచి దోమలు రూపాంతరం చెందుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోరుట్ల, ఆగస్టు 27 : పట్టణంలోని కోటి నవదుర్గ లయన్స్ మహిళ క్లబ్ అద్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా రేకుర్తి వైద్యులు వైద్య సేలను అందించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి వైస్ చైర్మన్ చిదుర సురేష్, క్లబ్ 320 గవర్నర్ నడిపల్లి వెంక టేశ్వర్ సౌజన్యంలో శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి 45 మందికి శస్త్ర చికిత్సలు అవసరం ఉండగా వారిని రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పోతని శ్రీలత, పోలాస గీతారాణి, మంచాల రోజారమణి , ఆడెపు కమల, అల్లాడి శోభ, జిల్లా సభ్యులు గుంటుక చంద్రప్రకాష్, అల్లాడి ప్రవీణ్, అడెపు మధు, మంచాల జగన్, శ్రీగద్దె నరేంధర్, పోలాస రవీంధర్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

కోరుట్ల, ఆగస్టు 27 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. అర్చన, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పై 50 మందికి స్రీనింగ్ పరీక్షలను చేశారు.

క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టాఫ్ నర్సు గంగాజ మున, సూపర్ వైజర్లు మజీద్, శ్రావణి, ఏఎన్‌ఎం శారదలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: రాష్టంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హై స్కూల్‌లో రూ.1కోటి 64లక్షలతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తికాగా మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందు గతంలో సైతం పాఠశాలల అభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ఓల్డ్ హై స్కూల్ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో చరిత్ర ప్రాధాన్యత ఉందని గుర్తు చేశారు. అమృత్ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలకు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. రూ.2వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు కేటాయించామన్నారు. ఇందులో జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి 50 పాఠశాలలకు నిధులు కేటాయించారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఈవో డా.జగన్‌మోహన్‌రెడ్డి, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్‌లు చుక్క నవీన్, ధర్మరాజు, ప్రేమలతసత్యం, అనిల్, పంబాల రాము కార్యకర్తలున్నారు.

●జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వూటూరు నవీన్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నవీన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ బొడ్ల జగదీష్, ఎర్రవెల్లి సురేష్, పల్లెర్ల రాజు, తదితరులున్నారు.

●జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన సాయికృష్ణకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.12వేల విలువగల చెక్కును ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సంజయ్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మహేశ్వర్ రావు తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

కోరుట్ల, ఆగస్టు 27 : కోరుట్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నూతనంగా ఎంపికైన శ్రీరాముల అమరేందర్‌ను మంగళవారం మున్నూర్ కాపు, పద్మాశాలి సంఘ నాయకులు సన్మానించి అభినందించారు. అమరేంధర్‌ను పూల మాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూర్ కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బండారి శంకర్, కాపు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, పద్మశాలి సంఘ నాయకులు సిరిపురం గణేష్, గణేష్, డాక్టర్ రమేష్, శ్రీరాముల రవి పాల్గొన్నారు.

బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

మెట్‌పల్లి, ఆగస్టు 27(ఇబ్రహీంపట్నం): 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోనాగిరి దేవయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెరం బదూర్ లింబగిరి స్వామి కోరారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ 317 జీవో ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. తపస్ జిల్లా ఆర్గ నైజింగ్ కార్యదర్శి గుర్రాల ప్రేమ్ కుమార్, జిల్లా బాధ్యులు చిట్యాల యు గందర్, రవీంధర్, మహేష్ పాల్గొన్నారు.

కొచ్చెరువుకు జలయోగం

● రు. 28 లక్షలతో పనులు ● గంభీర్‌పూర్‌లో పెరిగిన భూగర్భ జలాలు



జలకళ పట్టిన గంభీర్‌పూర్ కొచ్చెరువు

కథలాపూర్, ఆగస్టు 27 : గత ఏడాది భారీ వర్షాలకు తెగిన గంభీర్‌పూర్ కొచ్చెరువుకు ఎట్టకేలకు జలయోగం పట్టింది. తుర్తి, అంబారిపేట అడవుల నుంచి వచ్చిన భారీ వరదకు ఈ చెరువు తెగిపోయింది. దీంతో బొమ్మెన, దూలూరు శివారులో వాగు వెంట ఉన్న పొలాలు కోతకు గురై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కొట్టుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ అధికారులు ఈ చెరువును పరిశీలించి సుమారు రు. 60 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక ఆ అంచనాలకు రు. 28 లక్షలకు కుదించి నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో గడిచిన వేసవి కాలంలో కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన తెగిన చెరువుకు మరమ్మతులు చేపట్టారు.

పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు కొచ్చెరువు జలకళ సంతరించుకోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు 600 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. ప్రధానంగా ఈ చెరువు నిండితే గ్రామంలో భూగర్భ జలాలు పెరిగాయని గ్రామ ప్రజలు ఆనందం వెలిబుచ్చుతున్నారు. మత్తడికి మరమ్మతులు చేసే పనులు ఇంకా మిగిలి ఉన్నాయి.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ధర్మపురి, ఆగస్టు 27: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైష్ణవ శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ప్రధాన ఆలయంలోని బలరామకృష్ణుని వద్ద గల స్వామి వారికి ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి షోడశోపచార పూజలు, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అలాగే కృష్ణాష్టకస్తోత్ర పారాయణం, విష్ణుసూక్తములతో అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు గోపిక కృష్ణ వేశాధారణలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన విశిష్టతను నాటిక రూపంలో ప్రదర్శించి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అవరణంలో ఉట్టిని కోట్టి సంబరాలను జరిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయుడు చిట్నేని కృష్ణమోహన్ రావు పాల్గొన్నారు.



వెల్గటూర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

వెల్గటూర్: వెల్గటూర్ మండల కేంద్రంలో వీరా, నానీ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన యువకుడికి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్ గౌడ్ రూ.3016లు అందజేశారు. కృష్ణుడు, గోపికలు వేషధారణలో వచ్చిన చిన్నారులకు కిడ్స్ స్మార్ట్ వాచ్‌లు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సిరిపురం తిరుపతి చిన్నారులకు చిరు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ మెరుగు మురళిగౌడ్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద, కొల్వాయి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద మం గళవారం సాయంత్రం గోపాల కాలువలు కార్యక్రమంలో భాగంగా ఉట్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు మధుకుమార్, నాయకులు గుడిసె జితేంధర్ యాదవ్, ఆడెపు తిరుపతి, రవి కుమార్, యేసుదాసు, రామకిష్టు గంగాధర్, రంగు లక్ష్మన్, నవీన్ రావ్ పాల్గొన్నారు.





కోరుట్లలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు...వెల్గటూర్‌లో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు